క్లుప్తంగా

కొనసాగుతున్న సదరం క్యాంప్



తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాలను పునఃపరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. ఆర్థో, ఈఎన్‌టీ, సెక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. శుక్రవారం కూడా క్యాంప్ జరుగుతుందని వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి చెప్పారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



కొల్లిపర: పంచాయతీరాజ్ యాక్ట్ 1994లో 23వ రాజ్యాంగ సవరణ ద్వారా ఏప్రిల్ 24న ప్రవేశపెట్టారని, అప్పటి నుంచి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటున్నట్లు ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి సమక్షంలో ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి పంచాయతీరాజ్ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవ్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయం సిబ్బంది, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

మే10లోపు రుణాలకు దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు వ్యక్తిగత సబ్సిడీ రుణాల కోసం మే 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్హత సర్టిఫికెట్‌లతో పాటు తెల్లరేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈఅవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

బైక్ అపహరణపై కేసు నమోదు

తెనాలిరూరల్: బైక్ అపహరణపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కావూరి మహేష్ తన సెల్‌ఫోన్‌ను రిపేర్ చేయించేందుకు గంగానమ్మపేటలోని ఓ సెల్ పాయింట్‌కు ఫిబ్రవరి 26న వెళ్లాడు. తన వాహనాన్ని రోడ్డు వెంబడి పెట్టి దుకాణంలోకి వెళ్లి రాగా వాహనం కనబడలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను గుఉవారం ఆశ్రయించగా టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'శ్రీమాత' భారతదేశ శాశ్వత ఆగమన దినోత్సవం



తెనాలి: పాండిచ్చేరిలోని శ్రీఅరవింద ఆశ్రమ అధినేత్రి శ్రీమాత ప్యారిస్ నుంచి 1920 ఏప్రిల్ 24న భారతదేశానికి శాశ్వతంగా విచ్చేసి, ఆశ్రమం కేంద్రంగా ప్రపంచంలోని సర్వమానవులకు ఆధ్యాత్మిక పదనిర్దేశం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం ఇక్కడ వేడుకలను జరిపారు. నాజరుపేటలోని శ్రీఅరవింద విద్యాకేంద్రంలో తొలుత సామూహిక ధ్యానంతో కార్యక్రమాలను ఆరంభించారు. తదుపరి విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ చేశారు. రోజరి కాన్వెంట్ డైరెక్టర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి శ్రీమాత పతాకాన్ని ఆవిష్కరించారు. 'దివ్యదీపిక' ప్రత్యేక సంచికను విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు ఎస్.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. శ్రీఅరవింద విద్యాకేంద్రం డైరెక్టర్ కె.సంపూర్ణ అధ్యక్షత వహించారు. ఎ.అంజనేయులు, సయ్యద్ బాషా, హెచ్‌ఎం ఆర్.నిర్మల కుమారి పాల్గొన్నారు.

సిఫార్సు ఉంటేనే రుణం

- ప్రజాప్రతినిధుల కార్యాలయాల నుంచి లేఖలు
- వారినే ఎంపిక చేస్తున్న అధికారులు
- నిజమైన లబ్ధిదారులకు మొండిచెయ్యి



ఎంపీడీవో కార్యాలయంలో సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న బ్యాంకు అధికారులు (ఫైల్)

తెనాలిఅర్బన్: ఓసీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారు స్వయం ఉపాధి పొందేందుకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని ప్రకటించడంతో ఎంతోమంది ఆశతో దరఖాస్తులు చేసుకున్నారు. రుణం మంజూరవుతుంది చిన్న బడ్డీ కొట్టు పెట్టుకుని జీవిద్దామనుకున్న వారి ఆశలను కూటమి నాయకులు వమ్ము చేస్తున్నారు. కూటమి పెద్దలు తమ అనుయాయులకు కట్టబెట్టే పనిలో పడ్డారు. బ్యాంకు అధికారులకు సిఫార్సు లేఖలు పంపారు. సిఫార్సు లేఖలు ఉన్న వారికే బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేస్తున్నారు. దీంతో రుణాలు మంజూరు కాక అర్హులైన అనేక మంది నిరాశ చెందుతున్నారు. తెనాలి పట్టణం, మండల పరిధిలోని ఓసీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారికి వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రూ.లక్ష నుంచి అయిదు లక్షల వరకు రుణం ఇప్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాకుండా రుణంలో 50 శాతం ప్రభుత్వం సబ్సిడీ కింద చెల్లిస్తోందని తెలిపింది. దీంతో తెల్లరేషన్ కార్డు కలిగి, ఏదోక వ్యాపారం చేసుకునే వారు, చేయాలని భావించే వారు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. పట్టణ పరిధిలోని వారి కోసం కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో, మండల పరిధిలోని వారి కోసం ఎంపీడీవో కార్యాలయంలో రుణమేళా ఇటీవల నిర్వహించారు. అన్ని బ్యాంక్‌లకు చెందిన ఉద్యోగులు మేళాలో పాల్గొని దరఖాస్తు చేసుకున్న వారి విద్యార్హత సర్టిఫికెట్‌లు, క్యాస్ట్, ఇన్‌కం వంటి వాటిని పరిశీలించి వాటి నకలు కాపీలు తీసుకున్నారు. తెనాలి పట్టణం, మండల పరిధిలో మొత్తం 2453 మంది దరఖాస్తు చేసుకున్నారు.

లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం.

వ్యక్తిగత రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్‌లు, ఇతర ఆదాయ వనరుల వివరాలు బ్యాంక్ అధికారులు సేకరించారు. వారి సిబిల్ స్కోర్, ఇప్పటి వరకు బ్యాంక్‌లో వారు జరిపిన లావాదేవీలు పరిశీలించారు. అన్ని కరెక్ట్‌గా ఉన్న వారి వివరాలు నమోదు చేసి బ్యాంక్ అధికారులు మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలకు పంపారు. నిబంధనల ప్రకారం వీరిలో కొంత మందిని ఎంపిక చేయాల్సి ఉంది. ఇంతలో కూటమి ప్రజాప్రతినిధుల నుంచి తమ అనుయాయుల జాబితాలు పంపారు. దీంతో అధికారులు బ్యాంక్ అధికారులు పంపిన లిస్టను పక్కన పెట్టి ప్రజాప్రతినిధులు ఇచ్చిన జాబితాలోని వారిని ఎంపిక చేసే పనిలో పడ్డారు. కొద్దిరోజుల్లో ఎంపికైన లబ్ధిదారుల వివరాలు ప్రకటించే అవకాశం ఉంది.

10 శాతం మందికి కూడా ఇవ్వని రుణాలు

తెనాలి పట్టణ, మండల పరిధిలో ఓసీ, బీసీ రుణాల కోసం 2453 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తెనాలి పట్టణ పరిధిలో బీసీ రుణాల కోసం 1169 మంది, ఓసీ రుణాల కోసం 447 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే తెనాలి మండల పరిధిలో బీసీ రుణాల కోసం 525 మంది, ఓసీ రుణాల కోసం 312 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం వీరిలో తెనాలి పట్టణానికి కేవలం 155 మందికి, మండల పరిధిలో 96 మందికి మాత్రమే సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు అనుమతి ఇచ్చింది. వీరిలో పట్టణ పరిధిలో బీసీలు-88, ఓసీలు-67, మండల పరిధిలో బీసీలు-51, ఓసీలు-45 మంది ఉంటారు. దీనిని బట్టి చూస్తే దరఖాస్తు చేసుకున్న వారిలో కనీసం 10 శాతం మందికి కూడా రుణాలు ఇవ్వటం లేదని విషయం స్పష్టమవుతుంది. మొత్తం మీద వ్యక్తిగత రుణాలను కూడా కూటమి పెద్దలు వదలడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రాజకీయ జోక్యం లేదు



ఓసీ, బీసీ సబ్సిడీ రుణాలకు సంబంధించిన మేళాలను ఇటీవల నిర్వహించాం. తమకు వచ్చిన ప్రతి దరఖాస్తును బ్యాంక్ అధికారులకు అందజేశాం. వారు లబ్ధిదారుల సిబిల్ స్కోర్, ఇతర రుణాలకు సంబంధించిన వివరాలు పరిశీలించి ఫైనల్ జాబితా అందజేస్తున్నారు. వారు ఇచ్చిన జాబితా ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నాం. దీనిలో ఎటువంటి రాజకీయ జోక్యం లేదు.

–అత్తోట దీప్తి, ఎంపీడీవో, తెనాలి

ఉగ్రదాడిపై ముస్లింల నిరసన



ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న ముస్లిం మత పెద్దలు



క్యాండిల్స్ వెలిగించి నివాళులర్పిస్తున్న దారా రామకృష్ణ



శాంతి దీపయజ్ఞంలో బాలస్వామీజీ



పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

తెనాలిఅర్బన్: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ముస్లిం మత పెద్దలు ముఫ్తీ హైదర్ ఆలీ, ముఫ్తి అలాఉద్దీన్‌లు డిమాండ్ చేశారు. ఉగ్రదాడిని నిరసిస్తూ తెనాలి పట్టణ ముజ్‌లిసుల్-ఉలమా-వల్ అయిమా జమాయతి-ఉలమా హింధు ఆధ్వర్యంలో స్థానిక జామియా మసీదులో గురువారం కొద్దిసేపు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉగ్రవాదానికి మతం ఉండదన్నారు. ఇటువంటి ఘటనలను ఏ మతం సమర్థించదని చెప్పారు. ఇస్లాం శాంతిని బోధిస్తుందని చెప్పారు. భారతదేశంలోని ముస్లింలు అందరు దీనిని తీవ్రంగా ఖడిస్తున్నట్లు తెలిపారు. ఘటనలో మృతి చెందిన వారికి సంతాపం తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. భారతదేశ పౌరులుగా ప్రభుత్వానికి తామంతా మద్దతుగా ఉంటామని ప్రకటించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో...

జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా జనసేన పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యాలయం ముందు గురువారం శాంతియుత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఉగ్రదాడిని అందరు ముక్తకంఠంతో ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు శాంతియుత నిరసన తెలియజేస్తున్నట్లు చెప్పారు. దోషులను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని కుల, మతాలకు అంటగట్టడం అనైతిక చర్య

తెనాలి టౌన్: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని భారతీయ జనతాపార్టీ కుల,మతాలకు అంటగట్టడం రాజకీయ అనైతిక చర్య అని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దారా రామకృష్ణ అన్నారు. గురువారం ముత్తెంశెట్టిపాలెంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద పహల్గామ్ మృతులకు నివాళులర్పించారు. క్యాండిల్స్ వెలిగించి వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. రామకృష్ణ మాట్లాడుతూ పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని యావత్ భారతీయులు ముక్త కంఠంతో ఖండిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు భిన్నంగా దేశంలోని బీజేపీ నేతలు ఉగ్రదాడిని కులాలకు,మతాలకు అంటగడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్ పల్లె శ్యామ్యుల్, కంచర్ల ప్రవీన్, సయ్యద్ సికందర్, జిలానీ, ఖాసిం సాహెబ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాలిగ్రామ మఠంలో శాంతి దీపయజ్ఞం

తెనాలి: స్థానిక గంగనమ్మ పేటలోని శ్రీసాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో పుష్పగిరి పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) ఆధ్వర్యంలో కశ్మీర్లో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన పర్యాటకుల మృతికి నివాళులర్పించారు. శాంతి దీపయజ్ఞం చేశారు. బాలస్వామీజీ మాట్లాడుతూ పహల్గామ్ ఉగ్రదాడి దారుణమన్నారు. ఇలాంటివి జరగకుండా భగవంతుడు అందరికీ మంచి చేయాలని ప్రార్థించారు. భారత ప్రధాని, హోం మంత్రి స్పందనపై హర్షం వ్యక్తంచేశారు. బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముద్దాభక్తుని రమణయ్య, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

తెనాలి టౌన్: ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు అన్నారు. గురువారం స్థానిక మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి నాయకులు కొవ్వొత్తులు వెలిగించి పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. సాంబశివుడు మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్ర చర్యలను అరికట్టడంలో కేంద్రానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పి.నాగసూర్యశశిధరరావు, ద్వారకా శ్రీను, కె.బుల్లియ్య, చందు అయ్యప్ప, టి.సూర్యనారాయణ, రమేష్, స్టీవెన్ బాబు, మాధవరావు, శంకర్రావు, కోటేశ్వరరావు తదితరులున్నారు.

కాల్వలోకి బోల్తా కొట్టిన లారీ



తెనాలిరూరల్: టైరు పేలడంతో లారీ అదుపు తప్పి కాల్వలోకి బోల్తా కొట్టిన ఘటన తెనాలి మండలం జాషువానగర్ వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెన్నై నుండి ఉప్పు లోడుతో విజయవాడ వెళుతున్న లారీ నందివెలుగు సమీపంలోకి రాగానే టైరు పేలి అదుపు తప్పింది. తెనాలి-విజయవాడ రహదారి వెంబడి ఉన్న కాల్వలోకి బోల్తా కొట్టింది. లారీలోని డ్రైవరు, క్లీనరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వాహనం వేగంగా లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని డ్రైవర్ తెలిపాడు.

దళిత ప్రజాప్రతినిధులకు సత్కారం



తెనాలి టౌన్: భారతరత్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించడంలో భారతీయ జనతాపార్టీ అవిరళ కృషి చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ జయంతి వారోత్సవాలలో భాగంగా గురువారం రూరల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన దళిత ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులను బీజేపీ ఆధ్వర్యంలో సత్కరించారు. ముందుగా తేలప్రోలు గ్రామంలోని శతాధిక వృద్ధురాలు వేజండ్ల విశ్రాంతమ్మను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కొలకలూరు గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి, అంగలకుదురు మాజీ సర్పంచ్ నలుకుర్తి విజయ, సంగంజాగర్లమూడి మాజీ సర్పంచ్ మాతంగి క్రీస్తు మణిమ్మలను సత్కరించి అభినందనలు తెలియజేశారు. ప్రజాప్రతినిధులుగా వారు గ్రామానికి చేసిన సేవలను గుర్తుచేశారు. పార్టీ నాయకులు కె.వాసుదేవనాయుడు, కడియాల నందకిషోర్, ఎం.వీరయ్య, వేజండ్ల రోశయ్య పాల్గొన్నారు.

ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న కూనల బాప్‌లాల్

తెనాలి: స్థానిక గాంధీనగర్‌లోని శ్రీవేంకటేశ్వర యోగ సేవాకేంద్రంలో 348వ ఉచిత యోగ శిక్షణ శిబిరం గురువారం ప్రారంభించారు. యోగ గురువు కూనల బాప్‌లాల్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతిరోజూ యోగ చేయటం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులు కాగలరని చెప్పారు. సేవాకేంద్రం కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉచిత యోగ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూర్యోదయానికి ముందే యోగ చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. ఆర్.భార్గవ్, యోగ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



తెనాలిఅర్బన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని మహిత జూనియర్ కళాశాల డైరెక్టర్ కొలసారి రాజశేఖర్ పేర్కొన్నారు. బస్టాండ్ సమీపంలోని సాయిబాబా గుడి వద్ద మేడిబోయిన శేషయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవ చైతన్య బీసీ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్, ప్రధాన కార్యదర్శి మల్లంపల్లి భీష్మపాములు, కళాశాల ప్రిన్సిపల్ ఎంఎస్ హరి ప్రసాద్, ఆర్‌టీసీ శ్రీను, పి యలమంద తదితరులు పాల్గొన్నారు.

తెనాలిని క్షయవ్యాధి రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం



సీవైటీబీ పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌లు

తెనాలిఅర్బన్: క్షయవ్యాధి రహిత పట్టణంగా తెనాలిని తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని ఎయిమ్స్ జూనియర్ రెసిడెంట్ డాక్టర్ ఉత్కర్ష తివారి పేర్కొన్నారు. నందులపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఊపిరితిత్తుల టీబీకి మందులు వాడుతున్న వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు గురువారం సీవై టీబీ పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర క్షయ వ్యాధి నివారణ జాయింట్ డైరెక్టర్ టీ రమేష్ ఆదేశాల మేరకు వీటిని చేస్తున్నట్లు తెలిపారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన వారికి పరీక్షలు చేస్తున్నామన్నారు. క్షయ వ్యాధి నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వీలు దిలీప్ కుమార్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో వివేక విద్యార్థుల విజయభేరి



ఉన్నత ఫలితాలను సాధించిన విద్యార్థులతో వీరనారాయణ, ఉదయ్‌కిరణ్, వెంకటరత్నం

తెనాలి: పదో తరగతి పరీక్షల్లో వివేక విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించినట్లు వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ రావు అన్నారు. తమ విద్యార్థినులు సీహెచ్ పరమేశ్వరి 595/600, యు.జోషిత 590/600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో అత్యున్నత ఉత్తీర్ణతను సాధించటం గర్వకారణమన్నారు. స్థానిక వివేక హైస్కూలు ప్రాంగణంలో ఉత్తమ మార్కులు కైవసం చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బుధవారం సాయంత్రం అభినందన సభ నిర్వహించారు. అధ్యక్షత వహించిన డాక్టర్ వీరనారాయణ మాట్లాడుతూ వివేక విద్యార్థులు ఎం.అస్మిత, నిస్సీ 589 మార్కులు చొప్పున సాధించగా, మంజుశ్రీ 588, జి.మహాలక్ష్మి, గీతిక, చకిత్, షయాన్‌లు 587 మార్కులు, రాజహర్షిణి, సత్తార్ 586 మార్కులు, సీహెచ్ భరణి, షాదియాలు 585 మార్కులతో సత్తాను చాటారని తెలిపారు. మొత్తం 21 మంది 580 మార్కులకు పైగా సాధించగా, 98 మంది విద్యార్థులు 550 పైగా మార్కులతో ఉత్తీర్ణతను పొందారని వివరించారు. సాధారణ గ్రామీణ విద్యార్థులతోనే రాష్ట్రస్థాయి ఫలితాల సాధనతో వివేక విద్యాసంస్థలు ముందంజలో ఉన్నట్లు చెప్పారు. అత్యున్నత ఫలితాలను సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. వివేక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గుత్తా వెంకటరత్నం, సీఈవో రావిపాటి ఉదయ్‌కిరణ్, అకడమిక్ కో-ఆర్డినేటర్ షహనాజ్ బేగం, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు రమేష్, మురళి, రాంబాబు, బాబూరావు, లావణ్య, రోజా, బ్రహ్మారెడ్డి, కమలజ, బాషా, ఇవాంజిలిన్, రాజీబాబు, ఠాగూర్ పాల్గొన్నారు.

ఆశ్రమం నుండి ఇంటికి చేరాడు

సాక్షి ఎఫెక్ట్



కార్మెల్ సదన్‌లో రాధాకృష్ణమూర్తితో సోదరుడు

తెనాలి: మానవత్వమా...నీ జాడెక్కడ...శీర్షికన ఈనెల 24న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం సేవాసదనంలో చేర్చిన వ్యక్తిని ఇంటికి చేర్చింది. వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా కొల్లూరు మండల గ్రామం అనంతవరానికి చెందిన దావులూరి రాధాకృష్ణమూర్తి (65) స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఐసోలేషన్ గదిలో దిక్కుమొక్కు లేకుండా పడివుండటం, స్వచ్ఛంద సేవాసంస్థ 'హెల్పింగ్ సోల్జర్స్' అతడిని గమనించి, మంచినీరు, ఓఆర్ఎస్ ఇచ్చి ఆహారం ఇచ్చారు. అప్పుడు తన పేరు దావులూరి రాధాకృష్ణమూర్తి అనీ, అనంతవరం గ్రామమనీ, ముగ్గురు బిడ్డలు ఉన్నారనీ ఆయన వివరాలు తెలియజేశారు. పెద్దగా అరుస్తూ బట్టలు వేసినా తీసేస్తున్నాడనీ, రోగులను ఏదైనా చేస్తారనే భయంతో సిబ్బంది అతడిని ఐసోలేషన్ రూమ్‌లో చేర్చినట్టు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఇదే విషయంపై 'సాక్షి'లో వచ్చిన కథనాన్ని రాధాకృష్ణమూర్తి సోదరులు చూశారు. తెనాలిలో జరిగిన ఎడ్లపందేలకని వెళ్లిన తమ్ముడు ఇప్పటివరకు రాకపోవటంతో అతడి ఆచూకీ కోసం వారు అన్వేషిస్తున్నారు. పత్రికలో చూశాక తెనాలి జిల్లా ఆసుపత్రికి వెళ్లి ఆరా తీశారు. గుంటూరు దగ్గర్లోని గోరంట్లలో గల కార్మెల సదన్‌లో చేర్చామని తెలుసుకుని, అక్కడకు వెళ్లారు. వివరాలను తెలియపరచి తమ సోదరుడిని అప్పగించాలని దావులూరి రామలింగయ్య లిఖితపూర్వకంగా సదన్ నిర్వాహకులను కోరారు. దీనితో కథ సుఖాంతమైంది.

జనజీవన జాగృతి జగ్జీవన్‌రామ్



పోస్టర్ ఆవిష్కరించిన మేకల సురేష్, పక్కన దిలీప్‌రాజా, మిలటరీ ప్రసాద్, కృష్ణమోహన్

తెనాలి: జనజీవన జాగృతి భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవనరామ్ అని బీజేఆర్ (బాబు జగ్జీవన్‌రామ్) కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్ అన్నారు. స్థానిక సుల్తానాబాద్‌లో గురువారం బాబు జగ్జీవన్‌రామ్ సినిమా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ బయోపిక్ నిర్మాణంలో ఉన్న నేపథ్యంలో బీజేఆర్ కమిటీ సారథ్యంలో బీజేఆర్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటుచేయనున్న సినిమా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. గౌరవఅతిథిగా పాల్గొన్న చిత్ర దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ 2025లోనే జగ్జీవన్‌రామ్ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాల్లో ఉన్నట్టు చెప్పారు. జగ్జీవన్‌రామ్ పాత్రధారి మిలటరీ ప్రసాద్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ పాత్ర పోషించే అవకాశం రావటం తన అదృష్టమన్నారు. రావి కృష్ణమోహన్ (చిన్ని), బీజేఆర్ కమిటీ సభ్యులు బడుగు సురేష్, గాజుల వట్టి రాజేష్, చిలక రత్నరాజు, జితేంద్ర, కోట లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పట్టణ శివారు పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి జూదరులను అరెస్ట్ చేశారు. పట్టణ రామలింగేశ్వరపేట పూలే కాలనీ శివారులోని పొలాల్లో పేకాట ఆడుతున్నారని రూరల్ పోలీసులకు గురువారం రాత్రి సమాచారమందింది. ఎస్ఐ కె.ఆనంద్ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించి నలుగురు జూదరులను, అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి మూడు సెల్‌ఫోన్‌లు, రూ.14,500 స్వాధీనపర్చుకున్నారు.

నేడు స్ట్రోక్‌పై ప్రత్యేక కార్యక్రమం

గుంటూరు మెడికల్: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ సహకారంతో గుంటూరులో స్ట్రోక్‌పై శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పమిడి ముక్కల విజయ, సెక్రటరీ డాక్టర్ అరవింద్ శర్మ గౌరవ అతిథులుగా విచ్చేస్తున్నట్లు రోటేరియన్, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పి.వి.సత్యనారాయణ తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com

శ్రద్ధాంజలి



మంచికి మారుపేరుగా, మహోన్నత వ్యక్తిగా
చిరునవ్వుల పలకరింపులతో,
అందరి హృదయాలలో సుస్థిర స్థానం పొందిన
మా గురువర్యులు సీనియర్ న్యాయవాది
కీ॥శే॥ భాగవతుల శివ సుబ్రహ్మణ్యం
(S.B శివ) గారి
అకాల మరణం మాకు తీరని లోటు
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ,
మరియు వారి కుటుంబ సభ్యులకు
మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ...
మట్లా మాణిక్యరావు అడ్వకేట్
అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు
అడపా పరిపూర్ణారెడ్డి అడ్వకేట్
వేజండ్ల శ్రీనివాస్ అడ్వకేట్
షేక్ ఖాదర్ హుస్సేన్ అడ్వకేట్
యమ్మంశెట్టి శివరామకృష్ణ ప్రసాద్ అడ్వకేట్
కీ॥శే॥ S.B శివ గారు
సీనియర్ న్యాయవాది, తెనాలి
జననం : 29-4-1962 మరణం : 14-04-2025
సంస్మరణ సభ : ది. 26-4-2025న శనివారం, తెనాలి కొత్తపేట N.G.O. కళ్యాణ మండపంలో ఉదయం 11:00 గంటలకు జరుగును. సెల్ : 9010439368